నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి


గోకుల్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్, అధికారులు

లింగోజిగూడ: ఎన్నో ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీతో కాలనీల్లో సమస్య ఏర్పడుతోందని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లో బుధవారం జలమండలి జీఎం బలరాం, డీజీఎం శ్రీనివాస్‌లతో కలిసి ఆయన పర్యటించారు. కాలనీలోని డ్రైనేజీ సమస్యను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మట్లాడుతూ, డ్రైనేజీ పొంగి పొర్లి రోడ్డుపై పారుతోందని, దీంతో కాలనీ వాసులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన అధికారులు నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ రామకృష్ణా రెడ్డి, కాలనీవాసులు సంపత్‌యాదవ్, చందుయాదవ్, లావణ్య, శ్రీనివాస్‌రెడ్డి, గట్టు మహేశ్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

చదవడం, నేర్చుకోవడం నిత్యకృత్యం కావాలి


నటుడు ప్రదీప్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న శశాంక్, స్వదేశీ

వనస్థలిపురం: మనిషి నిరంతర విద్యార్థి అని, చదవడం, నేర్చుకోవడం నిత్యకృత్యంలో భాగం చేసుకోవాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇంపాక్ట్ బీసీఐ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి అన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం, పిల్లల గోల్ సెట్టింగ్ అంశాలపై శిక్షణ పొందిన వనస్థలిపురం వైదేహినగర్‌లోని లిటిల్ ఫ్లవర్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ పాలోజు శశాంక్, ప్రిన్సిపాల్ పాలోజు స్వదేశీలకు ఆయన నటుడు ప్రదీప్‌తో కలిసి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శశాంక్, స్వదేశీ మాట్లాడుతూ, తాము పొందిన శిక్షణతో ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, పిల్లల పెంపకం– తల్లిదండ్రుల పాత్ర అంశాలపై శిక్షణను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఫౌండర్ గంపా నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ గృహంలో ఎస్పీ బాలు జయంతి వేడుకలు


బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోవిందాచార్య, చెన్ను హరేరాము

దిల్‌సుఖ్‌నగర్: ప్రఖ్యాత గాయకుడు పద్మ విభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలు) 78వ జయంతి వేడుకలను బుధవారం ఆర్‌కే పురం డివిజన్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీబీ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ద్వారా సంస్థ వ్యవస్థాపకులు శృంగారం గోవింద్ ఆచార్య, చెన్ను హరేరాము నిర్వహణలో బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. సినీ నేపథ్య గాయనీ గాయకులు బాలసుబ్రహ్మణ్యం పాటలను పాడి విద్యార్థులను అలరించారు. చదువుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గృహం విద్యార్థులకు ముఖ్య అతిథిగా హాజరైన గాయని మాళవిక చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్, కమిటీ సభ్యులు కృష్ణవేణి, శ్రీనివాస్, దైవజ్ఞ శర్మ, మాధవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ ఫలితాల్లో అపోలో అకాడమీ ప్రభంజనం


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

చైతన్యపురి: దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల్లో చైతన్యపురిలోని అపోలో మెడికల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించినట్లు అకాడమీ డైరెక్టర్ పోసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమ విద్యార్థులు 480 మంది నీట్ పరీక్షకు హాజరుకాగా, వారిలో 338 మంది ర్యాంకులు సాధించారన్నారు. 28 మందికి ఎయిమ్స్‌లో సీటు వచ్చిందన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్, అధ్యాపక బృందం శ్రీధర్, రాజు, గోవర్ధన్‌రెడ్డి, కేవీఆర్, సురేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

‘క్రిడా’ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: సీఐటీయూ


క్రిడా వద్ద ధర్నా చేస్తున్న కార్మికులకు మద్దతు తెలుపుతున్న కీసరి నర్సిరెడ్డి

మన్సూరాబాద్: క్రిడాలో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం ధర్నా చేస్తుంటే, ఫామ్ మేనేజర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి ఆరోపించారు. హయత్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం (క్రిడా) వద్ద గత కొద్ది రోజులుగా కార్మికులు చేపట్టిన నిరసన, ధర్నా కార్యక్రమాలకు సీఐటీయూ తరఫున మద్దతు తెలుపుతూ బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా క్రిడాలో పని చేస్తున్న కార్మికుల సర్వీస్‌ను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహిస్తునే ఉదయం, సాయంత్రం వేళల్లో అరగంట పాటు శాంతియుతంగా ధర్నా చేస్తున్న కార్మికులను బెదిరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తక్షణమే బెదిరింపులు నిలిపివేయాలని, కార్మికుల సమస్యలను క్రిడా యాజమాన్యం సహృదయంలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దర్శన్‌రాజు, నాగయ్య, బాలరాజు, కోటేష్, శ్రీకాంత్, అనిత, గీతా, నాగమణి, సమంత, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. రోడ్లు జలమయం


ఆర్‌కేపురంలోని కాలనీ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

దిల్‌సుఖ్‌నగర్: ఉరుములు, మెరుపులతో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి మలక్‌పేట్ జోన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, అక్బర్‌బాగ్, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, కాలడేరా, అజంపురా, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగి కాలనీ రహదారులపై ప్రవహించింది.

- ఓల్డ్‌మలక్‌పేట అల్కాపురి, టెలిఫోన్‌కాలనీ, వాసవికాలనీ, మార్గదర్శికాలనీ ప్రధాన రహదారులు వరద నీటితో గోదారిని తలపించాయి.
- మలక్‌పేట రైల్వేబ్రిడ్జ్ కింద వరద నీరు చేరడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. నల్గొండ క్రాస్‌రోడ్డు, మలక్‌పేట, చాదర్‌ఘాట్, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేటల్లో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

భారీగా క్రాస్ ఓటింగ్

- ఎల్‌బీనగర్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఓట్లు బీజేపీకి బదిలీ
- ఈటలకు లక్షకు పైగా మెజార్టీ


సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు దృశ్యం (ఫైల్)

ఎల్‌బీనగర్: లోక్‌సభ ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీజేపీకి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ఓట్లు భారీగా బదిలీ అయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థి సుధీర్‌రెడ్డి సాధించిన ఓట్ల కంటే ఈసారి బీజేపీకి అధికంగా ఓట్లు రావడం నియోజకర్గంలో చర్చనీయాంశమైంది.

- అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొనగా, ఆ ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి 1,11,380 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డికి 89,075, కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌కు 83,273 ఓట్లు వచ్చాయి.
- ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఈ ఓట్ల శాతం తలకిందులైంది. భారీగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓట్లు బీజేపీకి బదిలీ కావడడంతోనే ఇక్కడ ఈటల రాజేందర్‌కు లక్షకు పైగా మెజార్టీ వచ్చింది. అంటే .. ఇరు పార్టీలకు చెందిన నేతలు, నాయకులు భారీగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటంతోనే బీజేపీకి ఇక్కడ ఊహించని మెజార్టీ వచ్చిందని చెప్పవచ్చు.మోదీ ప్రధాన మంత్రి కావాలనే లక్ష్యంతోనే యువ ఓటర్లు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీ వైపు మొగ్గు చూపారని తెలుస్తోంది.





అంచనాలను మించి...

ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్‌కు భారీగా ఓట్లు పోలవుతాయని ఆ పార్టీ నాయకులు అనుకున్నారు. అయితే, వారి అంచనాలు తలకిందులయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే బీజేపీకి భారీగా ఓట్లు బదిలీ అయినట్లు తెలుస్తోంది. సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడం, కార్యకర్తలను సమన్వయం చేయడంలో అగ్ర నాయకులు ఘోరంగా విఫలం చెందారని, అందువల్లే బీజేపీకి క్రాస్ ఓటింగ్ ద్వారా లబ్ధి చేకూరిందని పార్లమెంటు ఎన్నికల ఫలితాలను బట్టి తెలుస్తోంది. ఇక బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల లోపాయికారీ పొత్తుల కారణంగానే గతంలో వచ్చిన ఓట్లు ఆ పార్టీకి పోల్ కాకుండా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు పోల్ కావడంతో ఎల్‌బీనగర్‌లో కమలం పార్టీ భారీ మెజార్టీ సొంతం చేసుకుంది.

- గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 1,11,380 ఓట్లు రాగా, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 33,839 ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ పార్టీది కూడా ఇదే పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికల్లో 83,273 ఓట్లు సాధించిన కాంగ్రెస్‌కు ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కేవలం 68,095 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. ఈ గణాంకాలను పరిశీలిస్తే మొత్తానికి ఎల్‌బీనగర్‌లో భారీగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి బీజేపీకి ఓట్లు బదిలీ అయినట్లు స్పష్టమవుతోంది.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ /వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 47, వంకాయ 23, బెండ 38, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 35, క్యాబేజీ 20, ఫ్రెంచి బీన్స్ 115, క్యారెట్ 40, దొండ 15–18, చిక్కుడు 65, గోకర 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 33, దోస 28, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 40. గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

రేపు భారత కళామేళా ప్రారంభం

చాదర్‌ఘాట్: ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసేబుల్డ్, వరల్డ్ పద్మశాలీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులు, సకలాంగులతో కూడిన వ్యాపార, పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ గజం నర్సింగరావు తెలిపారు. బుధవారం మలక్‌పేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, భారత కళామేళా పేరుతో నిర్వహించే ఈ ప్రదర్శన ఈనెల 7న మలక్‌పేటలోని దివ్యాంగుల జాతీయ పార్కులో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈనెల 16వ తేదీ వరకు కొనసాగే ఈ మేళాలో ఉదయం ప్రదర్శన, అమ్మకాలతో పాటు సాయంత్రం వేళల్లో దివ్యాంగ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో ఫెడ్ చైర్మన్ మద్దెల గంగారాం, చెరుకు నాగభూషణం పాల్గొన్నారు.

డీకే అరుణకు సన్మానం



సైదాబాద్: మహ మబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా గెలిపొందిన డీకే అరుణను బీజేపీ నేతలు సన్మానించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ నగరంలోని డీకే అరుణ నివాసానికి వెళ్లి ఆమెకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన డీకే అరుణ మరిన్ని ఉన్నత పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి

పహాడీషరీఫ్: వర్షాకాలం దృష్ట్యా మున్సిపాలిటీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి సూచించారు. బుధవారం అధికారులతో కలిసి మున్సిపాలిటీలోని ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ప్రజలు నివాసం ఉండొదన్నారు. మున్సిపల్ సిబ్బంది పాత భవనాల జాబితాను రూపొందించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వర్షపు నీరు నిలవడం, డ్రైనేజీ సమస్యలు ఉన్నట్లయితే మున్సిపల్ కార్యాలయంలోని టోల్‌ఫ్రీ నంబర్ 733087 7393 ద్వారా సంబంధిత అధికారులకు సమాచారం అందజేయాలని సూచించారు. కమిషనర్ వెంట డీఈ వెంకన్న, ఏఈ ఇష్రత్ ఆయేషా, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తదితరులు ఉన్నారు.

ఎల్‌బీనగర్ గడ్డ..బీజేపీ అడ్డా : సామ


విలేకరులతో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీజేపీకి 1,71,683 ఓట్లు పోలయ్యాయని, లక్షా 3 వేల మెజార్టీతో రావడం ద్వారా ఎల్‌బీనగర్ గడ్డ.. బీజేపీ అడ్డా అని మరోసారి నిరూపితమైందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఎల్బీనగర్ చంద్రపురి కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బేరసారాలతో నాయకులను కొనుగోలు చేసిందని, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఓటర్లు ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంపై నమ్మకం ఉంచి ఈటల రాజేందర్‌కు అత్యధిక మెజార్టీ అందించారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానం మల్కాజిగిరితో పాటు ఆయన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లోనూ బీజేపీ విజయకేతనం ఎగురవేసిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందనడానికి ఇది నిదర్శనమని సామ పేర్కొన్నారు. ఈటల రాజేందర్ విజయం కోసం కష్టపడి పనిచేసిన బూత్ అధ్యక్షులు, కో ఆర్డినేటర్లు, ఏజెంట్లకు, నాయకులకు, కార్పొరేటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని, ఆఖండ మెజార్టీ ఇచ్చిన ఎల్‌బీనగర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పవన్‌కుమార్, నాయకులు ఠాకూర్ అశ్విన్‌సింగ్, తోట మహేందర్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, గంగదాసు కృష్ణారెడ్డి, ఎలే పురేందర్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కేవీకే కృషి


విజయం సాధించిన రైతును సత్కరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

హయత్‌నగర్: రైతులకు ఎప్పటికప్పుడు నూతన వ్యవసాయ పద్ధతులను చేరవేయడంతో పాటు తగిన శిక్షణ ఇస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కృషి చేస్తున్నదని హైదరాబాద్ ఐసీఏఆర్ అటారీ డైరెక్టర్లు షేక్‌ఎన్ మీరా, శ్రీనివాసరావు, ఆత్మ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా బుధవారం హయత్‌నగర్‌లోని రంగారెడ్డి జిల్లా కేవీకేలో నిర్వహించిన రైతు సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతుల ఆర్థికాభివృద్ధి కోసం సెరీ కల్చర్, అర్బన్ హార్టీ కల్చర్, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో నిత్యం వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా ఉద్యానవన అధికారి నీరజాగాంధీ మాట్లాడుతూ... ఉద్యానవన శాఖ, పశుసంవర్ధకశాఖలు ఎప్పటికప్పుడు గ్రామీణ యువతకు ఉపాధి శిక్షణ ఇస్తున్నాయని, రంగారెడ్డి జిల్లా కేవీకే ఆధ్వర్యంలో ఎంతోమంది రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధిచారన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు రైతులను సత్కరించారు. సీనియర్ సైంటిస్టులు చంద్రకాంత్, సుధీర్, శ్రీకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కలిసికట్టుగా నడుం బిగిద్దాం

వనస్థలిపురం: ప్రభుత్వం, ప్రజలు, అధికారులు సమన్వయంతో కాలుష్య నివారణకు నడుం బిగించాలని, లేదంటే ప్రకృతితో పాటు భవిష్యత్ తరాల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని తెలంగాణ రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నరసింహా రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం రంగారెడ్డి జిల్లా సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్, జాగృతి అభ్యుదయ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో వనస్థలిపురంలో పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షుడు భావన శ్రీనివాస్ ..‘నేల తల్లిని కాలుష్యం నుంచి కాపాడుకుందాం ’అంటూ సీనియర్ సిటిజెన్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు. అత్యంత కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తక్షణమే ఆపి వేసి జ్యూట్, వస్త్ర సంచులు, స్టీల్ డబ్బాలను వినియోగించుకోవాలని శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులు పి.రామిరెడ్డి, కె.రాంప్రసాద్, కె.కృష్ణారెడ్డి, అశోక్‌రాజు, సాంబశివరావు, ప్రతాప్‌రెడ్డి, కృష్ణాదిశేషు, డా.డి.వెంకటేశ్వర్లు, ఎస్.అప్పారావు, జాగృతి సభ్యులు శ్రీరంగనాథ్, రామలింగేశ్వర్‌రావు, అర్జున్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సిటిజెన్స్, జాగృతి అభ్యుదయ సంఘం ప్రతినిధులు

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్సూరాబాద్: శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ ఆధ్వర్యంలో శ్రీవైష్ణవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఆర్థిక ప్రదానం చేయనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి సేనాపతి మోహన్ తెలిపారు. ప్రతి ఏడాది అందిస్తున్నట్లుగానే 2024 మార్చి, ఏప్రిల్‌లో జరిగిన 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యున్నత మార్కులు సాధించిన శ్రీవైష్ణవ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై నెలలో శ్రీవైష్ణవ సేవా సంఘం రజతోత్సవాలు నిర్వహిస్తామని, ఆ కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలు, ఆర్థిక పారితోషికం అందిస్తామని వివరించారు. తెలంగాణలో 8వ తరగతి పాసైన ప్రతి పేద శ్రీవైష్ణవ విద్యార్థులు తండ్రిపేరు, చిరునామా, సాధించిన మార్కుల జాబితాతో చంద్రపురి కాలనీలోని శ్రీవైష్ణవ సేవా సదనంకు పోస్టు ద్వారా లేదా... నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సేనాపతి మోహన్ అన్నారు.

సీఎంకు శుభాకాంక్షలు


ముఖ్యమంత్రిని సన్మానిస్తున్న చేకోలేకర్ శ్రీనివాస్

మలక్‌పేట: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కృష్ణ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం


ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న డీఎం కృష్ణమూర్తి

చైతన్యపురి: విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపోలో డిపో మేనేజర్ కృష్ణమూర్తి శాలువాలతో సత్కరించి అభినందించారు. డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లు, సంస్థకు ఎక్కువ ఆదాయం తెచ్చిన కండక్టర్లతో పాటు గ్యారేజీలో పనిచేసే సిబ్బందిని సత్కరించారు. అసిస్టెంట్ మేనేజర్ ఉషశ్రీ, ఏఈ శివశంకర్, సూపరింటెండెంట్ ఉమాపతి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

దారి కాచి.. బైక్ లాక్కొని ఉడాయింపు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో దారి దోపిడీ ఘటనలు పునరావృతమవుతున్నాయి. వారం రోజుల క్రితం కారులో మద్యం కోసం వచ్చిన వారిని దుండగులు బెదిరించి ఫోన్, నగదు దోపిడీ చేయగా, తాజా ఘటనలో దారి కాచిన కొందరు.. వాహనదారులను ఆపి బెదిరించి బైక్ లాక్కొని ఉడాయించారు. వివరాలు ... ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే విద్యార్థి సయ్యద్ ఇస్మాయిల్ సోమవారం రాత్రి మలక్‌పేటలోని పెద్దమ్మ ఇల్లు షిఫ్టింగ్ పనుల్లో సాయం చేసేందుకు వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున 3.15 గంటల సమయంలో సోదరుడు సోహైల్ షేక్‌తో కలిసి బైక్ (ఏపీ28డీక్యూ4685)లో పెట్రోల్ పోయించుకొనేందుకు వెళ్లాడు. సింగరేణి కాలనీకి చేరుకోగానే హఠాత్తుగా రోడ్డుకు అడ్డుగా వచ్చిన ఇద్దరు యువకులు వారిని ఆపి నగదు ఇవ్వాలని బెదిరించారు. డబ్బులు లేవని చెప్పడంతో ఇద్దరినీ చేతులతో కొట్టారు. బైక్ లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. వారి సంభాషణను బట్టి దుండగుల్లో ఒకరి పేరు శివగా తెలుస్తోందని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవపడి భార్య అదృశ్యం

సైదాబాద్: భర్తతో గొడవపడిన భార్య ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి ఆచూకీ లేకుండాపోయింది. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖాజాబాగ్ నివాసి ముడావత్ సంతోష్‌కు నేనావత్ అనిత(18)తో గత ఏప్రిల్ 24న వివాహమైంది. పెళ్లైననాటి నుంచి ఇరువురి మధ్య చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 4న సంతోష్ ఉద్యోగరీత్యా బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. అప్పుడు అతని సోదరి సుశీల అనిత ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిందని తెలిపింది. భార్య కోసం అతను తమ బంధు,మిత్రులను వాకబు చేసినా ఆచూకీ తెలియ రాలేదు. దాంతో సంతోష్ సైదాబాద్ పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి

పహాడీషరీఫ్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు విధిగా మొక్కలను నాటి సంరక్షించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, భావి తరాల కోసం మొక్కలను పెంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.